క్లుప్తంగా

రాష్ట్ర 'ఖోఖో' కెప్టెన్‌గా జానకి



నెక్కొండ: తెలంగాణ రాష్ట్ర బాలికల ఖోఖో జట్టు కెప్టెన్‌గా మూడు జానకిని ఎంపిక చేసినట్లు తెలంగాణ ఖోఖో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ నతి కృష్ణమూర్తి గురువారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని సూరిపల్లి హైస్కూల్ విద్యార్థిని జానకి (8వ తరగతి) ప్రతిభను గుర్తించి ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నేటి (శుక్రవారం) నుంచి మూడురోజుల పాటు తమిళనాడులో జరిగే ఖేలో ఇండియా లీగ్ సబ్ జూనియర్ జాతీయ స్థాయి పోటీల్లో కెప్టెన్‌గా వ్యవహరించనున్నట్లు వెల్లడించారు. హెచ్‌ఎం బత్తుల పరమేశ్వర్, సర్పంచ్ సింగార పు గీత, ఎంపీటీసీ మాదాసు శారద, ఎస్‌ఎంసీ చైర్మన్ వెంకటమల్లు, పీఈటీ కోట రాంబాబు, ఉపాధ్యాయులు జానకిని అభినందించారు.

రాష్ట్ర స్థాయి 'రగ్బీ'కి ఎంపిక



నర్సంపేట రూరల్ : మండలంలోని మాదన్నపేట జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థి ముప్పారపు కేశవ 67వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ స్కూల్ గేమ్స్ అండర్–17 విభాగంలో రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం అలూరు రాంచంద్రు తెలిపారు. కేశవతోపాటు పీఈటీ నాడెం సంతోశ్‌ను పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం, సర్పంచ్ చంద్రమౌళి, విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. గత నెల 30న ఆరు ఉమ్మడి జిల్లాల విద్యార్థులతో మహబూబాబాద్‌లో జరిగిన పోటీల్లో కేశవ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం చెప్పారు. ఈనెలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో కేశవ పాల్గొంటారని తెలిపారు.

'ఎంజేపీ' విద్యార్థుల ప్రతిభ



దుగ్గొండి : మహాత్మా జ్యోతిబా పూలే (ఎంజేపీ) గురుకుల విద్యాలయాల ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో మండలంలోని గిర్నిబావిలోని ఆ స్కూల్ విద్యార్థులు 600 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా పరుగు పందెంలో నిఖిల్‌నాయక్ ప్రథమ, అజయ్ ద్వితీయ స్థానాల్లో నిలిచి గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించగా వారిని ప్రిన్సిపాల్ కూరోజు దేవేందర్, ఉపాధ్యాయులు ప్రభాకర్, రాజు, సుకుమార్, సోమ రాణి, సురేశ్, తదితరులు అభినందించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

పర్వతగిరి: కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం మండల అధ్యక్షుడు అబ్బపురి వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గడప గడపకు ఆరు గ్యారంటీల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని, వర్ధన్నపేట నియోజకవర్గంలో ప్రతి ఊరిని అభివృద్ధి పథంలో నడిస్తామన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి వర్ధరాజేశ్వర్‌రావు, అనిల్, దిలీప్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అవకాశవాద రాజకీయాలను ఎండగట్టాలి

గీసుకొండ : అవకాశవాద రాజకీయాలను ఎండగట్టాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ కోరారు. మండలంలోని గంగదేవిపల్లిలో జిర్ర కనకయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో రమేశ్ పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో నీతి, నిజాయితీ కలిగిన, బీఎల్‌ఎఫ్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అవకాశవాద రాజకీయాలను అంతం చేసేందుకు కమ్యూనిస్టులు, అంబేడ్కర్‌వాదులు ఏకం కావాలని సూచించారు. ఓటర్లకు డబ్బులు ఇచ్చి ప్రలోభపెట్టే పార్టీల అభ్యర్థులకు గుణపాఠం చెప్పేలా ప్రజలను చైతన్యవంతం చేయాలని శ్రేణులకు చెప్పారు. సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కుమారస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు సంధ్య, మండల కార్యదర్శి కుమారస్వామి, సహాయ కార్యదర్శి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

వర్ధన్నపేట : దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు షరీఫ్ కోరారు. మండల కేంద్రంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. అక్టోబర్ 2న ఇల్లందలో వికలాంగుల సమస్యలపై తెలుసుకున్నట్లు చెప్పారు. గృహలక్ష్మి పథకానికి ముగ్గురు దరఖాస్తు చేసుకోగా కొందరికి స్లాట్ బుక్ కాకపోవడంతో ఫించన్ ఆగిపోయిందని, ఒకరికి సర్టిఫికెట్ ఉన్నా పింఛన్ రావడం లేదన్నారు. వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం 500 మందికి కుట్టు మిషన్ల పంపిణీ, మహిళా సంఘాలకు శాశ్వత భవనాల మంజూరు పత్రాలు, బతుకమ్మ చీరల పంపిణీ, 197గ్రామాల యువతకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ, 317మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో నర్సంపేట నియోజకవర్గం అభివృద్ధిలో అట్టడుగున నిలిచిపోయిందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రుల సహకారంతో నియోజకవర్గానికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. హామీ ఇవ్వని అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అఫీషియల్ ప్రోగ్రామ్ అండ్ డైలీ షెడ్యూల్ అప్డేట్స్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మహిళల ఆర్థికాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. ఛాయ సోషల్ సర్వీస్ సొసైటీ, ఎఫ్‌ఎంఎం సోషల్ సర్వీస్ సహకారంతో నర్సంపేట 12వ వార్డులో ముస్లిం మహిళలకు 45 రోజుల ఉచిత మగ్గం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శిక్షణ పూర్తయిన ముస్లిం మహిళలకు ఛాయ సోషల్ సర్వీస్ సొసైటీ కార్యదర్శి కోట డేవిడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సర్టిఫికెట్లను అందజేసి మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని, కౌన్సిలర్ ఎండీ పాషా, దార్ల రమాదేవి, ఇందిర, ఎఫ్‌ఎంఎం సంస్థ సభ్యులు కరుణ, అజయ్, రవి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఏసీపీ కార్యాలయం పక్కన రూ.20 లక్షలతో చేపట్టిన మహిళా సమన్వయ సమితి భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రజిని, జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న, మహిళా సమన్వయ సమితి అధ్యక్షురాలు చిలువేరు రజినీభారతి, కార్యదర్శి గొర్రె రాధ, గౌరవ అధ్యక్షురాలు పెరుక కరుణ, తదితరులు పాల్గొన్నారు.

వినతి

ఖానాపురం : మండల కేంద్రంలో అదనపు స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని కోరుతూ సొసైటీ డైరెక్టర్ సాంబయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడారు. గ్రామంలోని తుంగబంధం సమీపంలో ఆర్ అండ్ బీ స్థలం ఉండగా పలువురు ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. సదరు భూమిని కాపాడి స్మశాన వాటిక నిర్మించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామస్తులు తోట జగన్నాథం, చంద్రయ్య, వీరన్న, తదితరులున్నారు.

ఎమ్మెల్యే సీతక్కకు సన్మానం



రాయపర్తి : సీతక్కతో కాంగ్రెస్ నాయకులు

రాయపర్తి : పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని దేవరుప్పుల మండలంలో హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటి ప్రచారంలో భాగంగా రాయపర్తి నుంచి వెళ్తుండగా ములుగు ఎమ్మెల్యే సీతక్కను కాంగ్రెస్ నాయకులు గురువారం సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, నాయకులు కృష్ణారెడ్డి, మాచర్ల ప్రభాకర్, కుంట రమేశ్, ముద్రబోయిన వెంకన్న, ఎనగందుల మురళి, రాంబాబు, కృష్ణమాచార్యులు, గ్రామపార్టీ అధ్యక్షుడు మచ్చ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ చల్లా మధుసూదన్‌కు..

గీసుకొండ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ప్రోగ్రాం ఆఫీసర్‌గా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై భూపాలపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా వెళ్తున్న డాక్టర్ చల్లా మధుసూదన్‌ను టీఎన్జీఓల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గాజే వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, ఉపాధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, పట్టణ కమిటీ అధ్యక్షుడు వెలిశాల రాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి వంగ రవీందర్, నాయకులు త్రివేణి, రామకృష్ణ, మధు, మాడిశెట్టి శ్రీనివాస్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పొగాకుల అశోక్‌కు..

సంగెం : స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిగా పని చేసి పీజీ సీటు సాధించిన డాక్టర్ పొగాకుల అశోక్‌ను ఎంపీపీ కళావతి ఆధ్వర్యంలో సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం ఎంపీపీ కళావతి మాట్లాడారు. అంకితభావంతో పని చేస్తేనే ప్రజలు గుర్తించుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గోపాల్‌రావు, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, సర్పంచ్ గుండేటి బాబు, ఎంపీటీసీ మల్లయ్య వైద్య సిబ్బంది సదానందం, కుమార్, రంజిత్, నాయకులు దిలీప్‌రావు, వీరస్వామి, రాజు, రమేశ్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

'మున్నూరు కాపు' భవనానికి రూ.20 లక్షలు మంజూరు

దుగ్గొండి : మున్నూరుకాపు సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు నిధుల మంజూరీ లేఖను మున్నూరు కాపు సంఘం మండల కన్వీనర్ శంకేషి రమేశ్‌కు ఎమ్మెల్యే గురువారం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి కన్వీనర్ రమేశ్ ఆధ్వర్యంలో నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. కులస్తులందరూ ఎమ్మెల్యేకు రుణపడి ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, నాయకులు నీలం పైడయ్య, శంకేషి కమలాకర్, వెంకటేశ్వర్లు, తదితరు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

నల్లబెల్లి: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు క్రమం తప్పకుండా చేపట్టాలని పంచాయతీ అధికారులను డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఈ మేరకు మండలంలోని శనిగరం, రాంపూర్ గ్రామాలను గురువారం ఆయన సందర్శించి, పల్లె ప్రగతి అభివృద్ధి పనులు, రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ఫాగింగ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ కూచన ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శులు జ్యోతి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



దరఖాస్తు తీసుకుంటున్న చైర్మన్ వేణుగోపాలచారి

చెన్నారావుపేట : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సమావేశం నిర్వహిస్తున్నట్లు సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ వేణుగోపాలచారి తెలిపారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వినియోగదారుల నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. మీటర్లలో లోపాలను, సరఫరాలో హెచ్చు తగ్గులను సరి చేస్తారని చెప్పారు. ఫిర్యాదులపై సత్వరమే స్పందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు (ఫైనాన్స్) చరణ్‌దాస్, నరేందర్, డీఈఈ సదానందం, ఏడీఈ జోగానంద్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరిక

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే ధర్మారెడ్డి

గీసుకొండ : సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు దూడె దిలీప్, యూత్ అధ్యక్షుడు చీర సందీప్, ఉపాధ్యక్షుడు పాషా, ప్రధాన కార్యదర్శి పోతరాజు అరుణ్, నాయకులు వంశీ, ధినేశ్, స్వామి, శ్రీకాంత్, చిరంజీవి, నాగయ్య, తదితరులు హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో బీఆర్‌ఎస్‌లో గురువారం చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే ధర్మారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్, జెడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, వైస్ ఎంపీపీ రడం శ్రావ్య, తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

నెక్కొండ : ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల కమిటీని గురువారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు కుడికాల రఘువీర్ వివరాలు వెల్లడించారు. గౌరవ అధ్యక్షులుగా దొనికెన రాజేందర్, తాటిపాముల వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా వేణు, ఉపాధ్యక్షుడిగా యాకాంబ్రం, కార్యదర్శిగా దేవేందర్, కోశాధికారిగా వినోద్, కార్యవర్గ సభ్యులుగా సారంగపాణి, నవీన్, యాకయ్య, శేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా రఘువీర్ ఎన్నికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ సంఘాన్ని పటిష్టం చేసి ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. రఘువీర్ మాట్లాడుతూ నేటి నుంచి జరగనున్న ఫొటో ఎక్స్‌పో లాంటి సదస్సులు ఫొటోగ్రఫీలో వెళకువలు తెలుసుకోవడానికి దోహదపడతాయని తెలిపారు.

ట్రాక్టర్ యజమానుల సంఘం..

ఖానాపురం : ట్రాక్టర్ యజమానుల సంఘం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తక్కళ్లపల్లి రమేశ్, ఉపాధ్యక్షుడుగా వల్లెపు శ్రీను, కోశాధికారిగా ఎడ్ల భిక్షంరెడ్డి, సభ్యులుగా సిరిపోతుల వీరస్వామి, బోగి సురేశ్, నామాల రవి, వరంగంటి దేవేందర్, కుందనపెల్లి వీరన్న, మోహిద్దీన్, గౌరవ సభ్యులుగా శాఖమూరి హరిబాబు, ఎడ్ల జగన్మోహన్‌రెడ్డి, బొప్పిడి రంగారావు, పరుచూరి నరేంద్ర ఎన్నికయ్యారు.

ఐఈఈఈ ప్రాముఖ్యతపై సదస్సు

నర్సంపేట రూరల్ : మండలంలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో ఐఈఈఈ డే పురస్కరించుకొని ఐఈఈఈ ప్రాముఖ్యతపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, బిట్స్ ప్రిన్సిపాల్ హరిహరన్ మాట్లాడారు. ఐఈఈఈ మెంబర్‌షిప్ వల్ల ప్రయోజనాలు, ఉద్యోగ అవకాశాలు వివరించారు. ఐడియా ఇగ్నైట్ చాలెంజ్ లోగోఫెస్ట్, క్విజ్ మానియా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీన్ (అకాడమిక్స్) నారాయణ, ప్రోగ్రాం కన్వీనర్ సురేశ్, కోఆర్డినేటర్ మధుకుమార్, విభాగాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రతలో సాగు మేలు

- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న



గీసుకొండ : పత్తి పంటను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న, శాస్త్రవేత్తలు

గీసుకొండ/సంగెం : సంప్రదాయ పద్ధతిలో పండించే పత్తి కంటే అధిక సాంద్రతలో సాగు చేయడం మేలని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న తెలిపారు. తద్వారా రైతులు అధికంగా దిగుబడి సాధించవచ్చని ఆయన స్పష్టం చేశారు. కేంద్రీయ పత్తి పరిశోధన స్థానం ప్రత్యేక శాస్త్రవేత్తల బృందం అధిక సాంద్రతలో పత్తి సాగు విధానంపై సంగెం మండలంలోని చింతపల్లి, నల్లబెల్లి, గీసుకొండ మండలంలోని అనంతారం, ఎల్కుర్తి గ్రామాల్లో క్షేత్రస్థాయి ప్రదర్శనలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజన్న మాట్లాడారు. అధిక సాంద్రతలో పత్తి సాగు చేస్తే పంట కాలం త్వరగా పూర్తవుతుందని, యాసంగిలో ఇతర పంట కూడా వేసుకోవచ్చని తెలిపారు. గులాబీ రంగు పురుగు ఉధృతి నుంచి పంటను కాపాడుకోచ్చని చెప్పారు. ప్రస్తుతం పత్తి పూత, కాయ దశలో ఉన్న క్రమంలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో కేంద్రీయ అధిక సాంద్రత పత్తి విభాగం శాస్త్రవేత్తల బృందం సీనియర్ శాస్త్రవేత్త శంకర్ నారాయణన్, శాస్త్రవేత్తలు శంకర్ గణేషన్, జాతీయ ఆహార భద్రత మిషన్ కన్సల్టెంట్ సారంగం, కేవీకే శాస్త్రవేత్తలు సౌమ్య, రాజు, ఏఈఓలు అఖిల, విజయ్, నూజివీడు సీడ్స్ ఏజీఎం నర్సింహారెడ్డి, రాశి సీడ్స్ ప్రతినిధి సూర్యప్రకాశ్, మహికో ప్రతినిధి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని ఖానాపురం, రాగంపేట గ్రామాల్లో వరి, పత్తి పంటలను వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం (ఏఆర్‌ఎస్) శాస్త్రవేత్తలు వీరన్న, సతీశ్‌చంద్ర, వీరన్న, అశ్విని క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు సూచనలు అందించారు.

పర్వతగిరి : మండలంలోని పలు గ్రామాల్లో వరంగల్ ప్రాంతీయ పరిశోధనా కేంద్ర శాస్త్రవేత్త జి.వీరన్న ఆధ్వర్యంలో పత్తి, వరి, మిర్చి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు అందించింది. కార్యక్రమంలో డాక్టర్ సతీశ్‌చంద్ర, వీరన్న, అశ్విని, ఏఓ టీవీఆర్ఆర్.ప్రశాంత్‌కుమార్, ఏఈఓలు రవి, చందులాల్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలుగా అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

నర్సంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టి మరోసారి మోసం చేయడానికి అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రకటిస్తుండగా వాటిని అమలు చేయాల్సిన అధికారులు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నమిండ్ల స్వామి అధ్యక్షతన నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో నాగయ్య మాట్లాడారు. సంక్షేమ పథకాలను ప్రకటించి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ఏ ఒక్కటి అమలు చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఆదేశాలిస్తే గ్రామసభలు నిర్వహించి అర్హులను గుర్తించి అధికారులు ప్రణాళికలు రూపొందించాల్సి ఉండగా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా సమ్మయ్య, జిల్లా నాయకులు రంగయ్య, బోళ్ల సాంబయ్య, వెంకన్న, శారద, తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత వాగ్దానాలను నమ్మొద్దు

- మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మాధవరెడ్డి

చెన్నారావుపేట : బీఆర్‌ఎస్ నాయకుల మోసపూరిత వాగ్దానాలను నమ్మొద్దని కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కోరారు. మండలంలోని తిమ్మరాయినిపహాడ్ క్రాస్ నుంచి మండల కేంద్రం వరకు గురువారం నిర్వహించిన 'హాత్ సే హాత్ జోడో యాత్ర' సందర్భంగా ఆయన మాట్లాడారు. దళితబంధు, ఇతరత్రా పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని చెప్పారు. రుణమాఫీ అమలు చేయకపోవడంతో రైతులపై లక్షకు రూ.60 వేల వడ్డీ భారం పడిందని తెలిపారు. ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల్లో రోడ్లు నిర్మించినట్లు, నీరు అందజేసినట్లు, పాకాల వాగుపై లిఫ్టులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి అధికారంలోకి వచ్చి ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌రావు, శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి యాకయ్యగౌడ్, మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం


ఒకే కుటుంబంలో కానిస్టేబుళ్లుగా ముగ్గురు



వర్ధన్నపేట : మండలంలోని కడారిగూడెం గ్రామానికి చెందిన కట్కూరి వెంకట నర్సమ్మ–అశోక్‌రెడ్డి దంపతుల ముగ్గురు కొడుకులు సంపత్, రామ్, లక్ష్మణ్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. కొత్తపల్లికి చెందిన నల్లతీగల మురళి, నల్లబెల్లికి చెందిన తాటికాయల రంజిత్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించారు.

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన సాదు నర్సమ్మ–సారయ్య దంపతుల కూతురు రవళి ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగాన్ని సాధించింది.

దంపతుల ఎంపిక



చెన్నారావుపేట : మండలంలోని ఖాదర్‌పేటకు చెందిన పెంత రాజేందర్–కల్పన దంపతులు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు.

అన్నాచెల్లెలు..



నర్సంపేట రూరల్ : మండలంలోని కమ్మపల్లికి చెందిన అన్నాచెల్లెలు చిలువేరు శ్రీకాంత్, వినీత కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. గురిజాల నుంచి పి.శ్రావ్య, జనగాం వినయ్, అల్లి అనిల్, బి.సృజన్ ఎంపికయ్యారు.

బొడ్డెమ్మ వేడుకలు షురూ



దుగ్గొండి : మండలంలో బొడ్డెమ్మ వేడుకలు మొదలయ్యాయి. మహిళలు చెరువు మట్టితో బొడ్డెమ్మను తయారు చేసి పూలతో అలంకరించి ఆడుకున్నారు. నాచినపల్లిలో రావుల కవిత ఇంటి వద్ద బొడ్డెమ్మను కనుల పండువగా నిర్వహించారు.

'ఓపెన్' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వర్ధన్నపేట : 2022–23 విద్యా సంవత్సరానికిగాను ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ కోఆర్డినేటర్ తాటిపాముల రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు ఈనెల 13లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం సెల్ నంబర్ 7981566031, 9441940847ల్లో సంప్రదించాలని కోరారు.

దీక్షల స్వీకరణ

గీసుకొండ : మండలంలోని ఊకల్ గ్రామంలోని నాగేంద్రస్వామి ఆలయంలో పలువురు భక్తులు గురువారం స్వామి వారి దీక్షలు స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనచార్యులు భక్తులకు మాలధారణ చేయించి పూజలు చేశారు. 40 రోజులు నిష్టతో ఉండాలని దీక్షా స్వాములకు అర్చకుడు శ్రీహర్ష సూచించారు.

రైతులకు పరిహారం చెక్కుల పంపిణీ

చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో రైతులకు పంట నష్ట పరిహారం చెక్కులను రైతు వేదిక క్లస్టర్ అధ్యక్షుడు యాట సుధాకర్ గురువారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చొరవతో పరిహారం చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొత్ర రజిత, కొమ్మాలు, ఏఈఓ రఘు, భిక్షపతి, గంధం భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి రాష్ట్ర మహాసభలు

నర్సంపేట రూరల్ : ఈనెల 15 నుంచి 17 వరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి కూనమల్ల కొమ్మాలు తెలిపారు. పట్టణంలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో మహాసభల వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొమ్మాలు మాట్లాడారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ కొత్ర సారయ్య, మండల అధ్యక్షుడు సర్దార్, ప్రధాన కార్యదర్శి రవి, నాయకులు నాగేశ్వర్, సంతోశ్‌కుమార్, బుచ్చిరాములు, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

చెన్నారావుపేట : మండల కేంద్రంలో రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన డ్రెయినేజీ, సీసీ నిర్మాణ పనులను జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రఫీ, సర్పంచ్ కుండె మల్లయ్య గురువారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. ఖబరస్తాన్ నుంచి చిట్టి లింగయ్య ఇంటి వరకు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు అయ్యూమ్, బీఆర్‌ఎస్ నాయకులు కంది కృష్ణచైతన్యరెడ్డి, మాజీ జెడ్పీటీసీ జున్నూతుల రాంరెడ్డి, ఎంపీటీసీ ధారావత్ శ్రీను, శ్రీధర్‌రెడ్డి, గొడిశాల సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

'క్రిమినల్ కేసు నమోదు చేయాలి'

కాశీబుగ్గ/ కాజీ సెంటర్: జిల్లాలోని చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన ఎరుకుల సామాజికవర్గానికి చెందిన దివ్యాంగుడు పల్లకొండ కుమారస్వామి స్థలం విషయంలో భూకబ్జాదారులు అతనిపై దాడికి పాల్పడటాన్ని ఖండిస్తున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా వికలాంగుల జేఏసీ కన్వీనర్ నల్లెల రాజయ్య పేర్కొన్నారు. భూకబ్జాకు పాల్పడటమే కాకుండా కుమారస్వామి, తల్లిదండ్రులపై దాడులకు పాల్పడిన వారిపై పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు, వికలాంగుల హక్కుల చట్టం –2016ప్రకారం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

'ఓట్ల కోసమే గృహలక్ష్మి పథకం'

సంగెం : ఓట్ల కోసం బీఆర్‌ఎస్ పార్టీ గృహలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి అధికారంలోకి వచ్చి బీఆర్‌ఎస్ అవకతవకలపై విచారణ చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేశ్, నాయకులు జనగాం రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ

చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయినిపహాడ్ గ్రామంలోని మహిళలకు సర్పంచ్ కొండవీటి పావని ప్రదీప్‌కుమార్ గురువారం బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడారు.కార్యక్రమంలో నాయకులు కొండవీటి ప్రదీప్‌కుమార్, రెడ్డి మాస్ కిశోర్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని కాట్రపల్లి, తిమ్మాపూర్ తదితర గ్రామాల్లో బతుకమ్మ చీరలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో సర్పంచులు పూలుగు సాగర్‌రెడ్డి, గన్ను శారద, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రాయపర్తి : ఎంపీపీ జినుగు అనిమిరెడ్డిని అతడి తండ్రి బుచ్చిరెడ్డి ఇటీవల మృతి చెందిన క్రమంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషా దయాకర్‌రావు పరామర్శించారు. బుచ్చిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంచనపల్లి వనజారాణి, తదితరులు పాల్గొన్నారు.